ప్రజాశక్తి
శనివారం 15 జూన్ 2024
5
విజయనగరం



అందుబాటులో ఉంటూ సేవ చేయండి

జెడ్పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం తన నివాసంలో సాలూరు నియోజక వర్గం, మెంటాడ మండలం సర్పంచులు, జెడ్పిటిసిలు, ఎంపిటిసి సభ్యులతో శుక్రవారం మాజీ మంత్రి పీడిక రాజన్నదొర, ఎమ్మెల్సీ సురేష్‌బాబుతో కలిసి సమావేశమయ్యారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపు ఓటములు సహజమని, ప్రజా తీర్పును గౌర వించాలని అన్నారు. నిరంతరం ప్రజలతో మమేకమై వారి సమస్యలు పరిష్కరించేం దుకు కృషి చేయాలని సూచించారు. నిరంతరం నియోజక వర్గం స్థాయిలో మాజీ ఎంఎల్ఎ పీడిక రాజన్నదొర, జిల్లా స్థాయిలో తాను కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపి ఈశ్వరరావు, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు

సంధ్యారాణికి స్త్రీ శిశు, గిరిజన సంక్షేమం

స్వయం ఉపాధి, గిరిజన సంక్షేమంపై జిల్లా వాసుల్లో చిగురిస్తున్న ఆశలు

గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్‌కు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ), పేదరిక నిర్మూలన సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిత, సంబంధాల శాఖ మంత్రిగా అవకాశం లభించింది. సాలూరు ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణికి స్త్రీ,శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీరిద్దరికీ మంత్రి పదవులు కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో, టిడిపి కార్యకర్తలు, నాయకుల్లో జోష్ నెలకుంది. మంత్రి శ్రీనివాస్ ఆదివారం జిల్లాకు రానున్నట్టు సమాచారం. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఆయన అనుచరులు, అభిమానులు, పార్టీ నాయకులు సిద్ధమయ్యారు. సంధ్యారాణి శుక్రవారం సాయంత్రమే జిల్లాకు చేరుకున్నారు. సాలూరులో ఆమెకు ఘన స్వాగతం లభించింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని మంత్రులిద్దరికీ మంచిశాఖలే లభించాయి. ముఖ్యంగా శ్రీనివాస్‌కు ఇదో అరుదైన అవకాశం. అనూహ్యంగా మంత్రి కావడంతో పాటు మంచి శాఖ కూడా లభించింది. గతంలో మన జిల్లా నుంచి భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా బొత్స సత్యనారాయణ పనిచేశారు. భూమి, నీరు, రోడ్డు, రవాణా సదుపాయాలు పుష్కలంగా ఉన్నప్పటికీ జిల్లాకు ఒక్కటంటే ఒక్క భారీ పరిశ్రమ కూడా రాకపోగా, ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయి. దీంతో, జిల్లా వాసులు కొంత నిరాశ చెందారు. తాజాగా శ్రీనివాస్‌కు అతి చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిగా అవకాశం వచ్చింది. తద్వారా జిల్లాలో ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నవారికి ఊరట కల్పించవచ్చు. ఇందుకు తగ్గ పరిశ్రమల ఏర్పాటుకు కూడా జిల్లా ఎంతో అనువుగా ఉంది. ముఖ్యంగా విజయనగరం పూర్తిగా వ్యవసాయ ఆధారిత జిల్లా. వరి విస్తారంగా సాగవుతున్నప్పటికీ మిల్లులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ పేరుతో ఏటా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని గోదావరి జిల్లాలకు పంపుతున్నారు. పత్తి, మొక్కజొన్న, చెరకు, మామిడి తదితర పంటలు కూడా ఎక్కువగానే సాగవుతున్నాయి. అటు ఏజెన్సీలో చింతపండు, జీడి సాగువుతుంది. వీటి ఆధారంగా మామిడి తాండ్ర, జీడి, మొక్కజొన్న ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మంచి అవకాశాలు ఉన్నాయి. ఇవి మచ్చుకు మాత్రమే. ఈ అన్ని రంగాల్లోనూ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుకు ప్రోత్సహించే అవకాశం మంత్రిగా శ్రీనివాస్‌కు దక్కింది. ఇప్పటికే జిల్లాలో జూట్, ఫెర్రో ఎల్లాయిస్ మూతపడిన నేపథ్యంలో శ్రీనివాస్‌కు దక్కిన శాఖకు ముఖ్యంగా మన జిల్లాలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతోపాటు సెర్ప్ (పేదరిక నిర్మూలన) విభాగం కూడా ఈయన పరిధిలోనే ఉంది. తద్వారా మహిళల్లో స్వయం ఉపాధి, సాధికారత సాధించే దిశగా ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుంది. ఇక ఎన్ఆర్ఐలతో మెరుగైన సంబంధాలు ఏర్పాటు చేయగలిగితే సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా రాష్ట్ర సంక్షేమం, ఉపాధి, స్కిల్ డెవలప్‌మెంట్, అభివృద్ధికి నిధులు తెచ్చుకునే అవకాశం కలుగుతుంది. తద్వారా సొంత జిల్లాకు ఎంతో కొంత ఎక్కువగానే మేలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందనడంలో సందేహం లేదు. యువకుడైన శ్రీనివాస్ సమర్థవంతగానే శాఖలు నిర్వహిస్తారని జిల్లా వాసుల్లో ఆశాభావం వ్యక్తమౌతోంది.

సుదీర్ఘ రాజకీయ అనుభవం గల సంధ్యారాణికి చంద్రబాబు రెండు కీలకమైన స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమశాఖలు అప్పగించారు. అభివృద్ధికి అత్యంత దూరంగా ఉన్న గిరిజనులు, అణిచివేతకు గురవుతున్న మహిళల సంక్షేమం ఆమె చూడాల్సి ఉంది. ఇప్పటికీ గిరిజనులు విద్య, వైద్య సదుపాయాలకు నోచుకోవడం లేదు. ముఖ్యంగా గిరి శిఖర గ్రామాల్లో డోలీ మోతలు, మార్గమధ్యలోనే ప్రసవాలు, శిశుమరణాలు కొనసాగుతున్నాయి. బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారు. చాలా గ్రామాల్లో ప్రభుత్వ బడులను గత ప్రభుత్వం ఎత్తివేయడంతో గిరిజన విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. రకరకాల కారణాలతో ఇప్పటికీ పూర్తిస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు గిరిజనులకు పూర్తిస్థాయిలో అందడం లేదు. ఇటువంటి తరుణంలో సంధ్యారాణిపై చంద్రబాబు ప్రభుత్వం పెద్ద బాధ్యతలే అప్పగించింది. సంధ్యారాణికి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజనల్ కోఆర్డినేటర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. సుదీర్ఘకాలం గిరిజన ప్రాంతంలోనే ఉండడం, సుదీర్ఘ రాజకీయ అనుభవంతో ఆమె ఈ రెండు శాఖలనూ సమర్థవంతంగానే నిర్వహిస్తారని జిల్లా వాసులు భావిస్తున్నారు.

గాలివాన బీభత్సం

ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు.. విరిగిపడ్డ విద్యుత్తు స్తంభాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శుక్రవారం గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో పలుచోట్ల చెట్లు నేల కూలాయి. బొబ్బిలిలో విద్యుత్తు స్తంభాలపై చెట్లు పడడంతో స్తంభాలు నేల మట్టమయ్యాయి. దీంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించేందుకు ఆ శాఖాధికారులు చర్యలు చేపట్టారు. బొబ్బిలి-మక్కువ రహదారిపై చెట్టు కూలింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్టును రైతులు తొలగించారు.
మెంటాడ, గజపతినగరం మండలాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఎక్కడికక్కడ చెట్లు నేలకొరిగాయి. పలు గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

కూలిన 28 విద్యుత్తు స్తంభాలు

శృంగవరపుకోట : మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలుల బీభత్సం సృష్టించాయి. మండలం మొత్తంగా 28 విద్యుత్తు స్తంభాలు, పలుచోట్ల చెట్లు నేల కూలాయి. దీంతో విద్యుత్ శాఖకు రూ.7 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. విద్యుత్ స్తంభాలు భారీగా విరిగిపోవడంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులకు ఎఇ రుద్ర రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు.

మెరకముడిదాం : మండలంలో శుక్రవారం తేలికపాటి వర్షం కుర్షింది. వాతావరణం చల్ల బడటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

వేపాడ : మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మూడు రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన ప్రజలకు వర్షంతో ఉపశమనం కలిగింది.

బొబ్బిలి-మక్కువ రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

శృంగవరపుకోట మండలంలో నేలకొరిగిన స్తంభం

పిడుగు పడి ఒకరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-వంగర

మండలం లోని మద్దివలస గ్రామ సమీపంలో పిడుగు పడటంతో వీరపిండి సీతారాం (33) అక్కడకక్కడే మృతిచెందు. యాలగాడ వెంకట నాయుడుకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మద్దివలస గ్రామానికి చెందిన కొంతమంది శుక్రవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని పొలాల్లోకి పశువులను మేతకు తీసుకువెళ్లారు. అదే సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో వారంతా ఇంటికి వచ్చే క్రమంలో వీరపిండి సీతారాంపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు ఆయన సమీపంలో ఉన్న వెంకట నాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను 108 వాహనంలో వంగర పిహెచ్‌సికి, అక్కడ నుంచి రాజాం ఆస్పత్రికి తరలించారు. పిడుగుపాటుకు గురై సీతారాం మృతి చెందడంతో ఆయన భార్య లావణ్య, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. సీతారాంకు ఆరు నెలల కుమారుడు ఉన్నారు. సీతారం తండ్రి విశ్వనాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వైవి జనార్ధన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సీతారాం (ఫైల్)

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

సామాజిక బాధ్యతగా కార్మిక సంఘం రక్తదానం చేయడం అభినందనీయం : డిఎంహెచ్ భాస్కరరావు

రక్తదాతలను అభినందిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు తదితరులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కార్మికుల సమస్యలపై పోరాటాలు మాత్రమే కాకుండా సిఐటియు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం వంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.బాస్కరరావు, డిసి హెచ్ బి.గౌరీశంకర్, కార్మిక శాఖ అధికారి ఎన్.సుబ్రమణ్యం, ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ రక్త దాన దినోత్సవం, చేగువేరా జయంతి సందర్భంగా సిఐటియు, మెడికల్ రిప్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం రోటరీ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభిస్తూ వారు మాట్లాడారు. రక్తం దానం చేయడం వలన దాత ఆరోగ్యం మేరుగుపడడమే కాకుండా ఆపదలో ఉన్న వారికి రక్త దానం చేసి వారి ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. ప్రస్తుతం రక్త నిల్వలు తగ్గడం వలన రక్త అవసరం ఎంతో అవసరం ఉందన్నారు. కిడ్నీ, డయాలసిస్, తలసెమియా, సికిల్ సెల్ అనిమియా, హిమోఫిలియా వంటి రోగులకు నిరంతరం రక్తం అవసరముంటుందన్నారు. ఇటువంటి సంఘాలు, సంస్థలు ముందుకు వచ్చి రక్తదాన శిబిరాలు నిర్వహించడం ద్వారా రోగుల ప్రాణాలను కాపాడవచ్చునని అన్నారు. ప్రజలు కూడా రక్తదానం పట్ల మరింత అవగాహన పెంచుకొని ఇటువంటి శిబిరాలలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు జి.అప్పలసూరి, ఎం.శ్రీనివాస, ఎ.గౌరినాయుడు, నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్ రావు, ఉపాధ్యక్షులు రెడ్డి శంకర్రావు, మెడికల్ రిప్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీను, కోశాధికారి డిఎల్ఎన్ మూర్తి సుధీర్, యుపిహెచ్‌సి ఎంప్లాయిస్ అధ్యక్షులు బాలరాజు, మున్సిపల్ యూనియన్ నాయకులు అరుణ్, యుగంధర్, లక్ష్మీ సాయి, ఫెర్రో అల్లాయిస్ యూనియన్ నాయకులు నాగరాజు, మిమ్స్ యూనియన్ నాయకులు నాగభూషణం, డివైఎఫ్ఐ నాయకులు హరీష్, అనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు 16న ఎంపికలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 16నఉదయం 9 గంటల నుంచి ఫైర్ చెస్ స్కూల్ ఆవరణలో అండర్ 19 ఓపెన్ అండ్ గర్ల్స్ జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తామని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి జ్వాలాముఖి ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఈ పోటీలకు జిల్లాలో 1-1-2005 తర్వాత జన్మించిన క్రీడాకారులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. పోటీలలో బాలుర విభాగంలో మొదటి నాలుగు స్థానాలు, బాలికల విభాగంలో మొదటి నాలుగు స్థానాలు రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 9703344488 నెంబరులో శనివారం సాయంత్రం 5 గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

పోలీసు పహారా మధ్య క్వారీ పనులు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలో రామచంద్రపేట వద్ద జిఎంఆర్ సంస్థ క్వారీ వివాదం మొదలైంది. రెండు రోజుల నుంచి ఆ సంస్థ పనులు ప్రారంభించగా రామచంద్రపేట గ్రామస్తులు అడ్డుకున్నారు. పోలీసుల పహారా మధ్య శుక్రవారం పనులు ప్రారంభించారు. అయినప్పటికీ పెద్ద ఎత్తున మహిళలు వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి ఈ సంస్థ ఇక్కడ క్వారీ అనుమతులు తెచ్చుకుంది. గ్రామానికి దగ్గరగా, పాఠశాలకు కూతవేటు దూరంలో ఎలా క్వారీ అనుమతులు ఇస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఎస్ఐ సూర్యకుమారి ఆధ్వర్యంలో పోలీసులు చేరుకొని పనులు అడ్డుకోవద్దని హెచ్చరించారు. సిఐ రవికుమార్ మాట్లాడుతూ జిఎంఆర్ సంస్థ క్వారీ నిర్వహణకు అవసరమైన అనుమతులను జిల్లా అధికారులు ఇచ్చారన్నారు. ఆ పనులను అడ్డుకుంటే అవసరమైతే కేసులు నమోదు చేస్తామని అన్నారు. గ్రామస్తులు కూడా పనులు ప్రారంభిస్తే రోడ్డెక్కుతామని హెచ్చరించారు.

క్వారీ వద్ద బైఠాయించిన గ్రామస్తులు

పింఛను పెంపుతో 2,82,194 మందికి లబ్ధి

జులై నుంచి పెంపు అమలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పింఛను మొత్తాన్ని రూ.4వేలకు పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలి సంతకం చేయడంతో జిల్లాలోని సామాజిక పింఛనుదారుల్లో హర్షాతి రేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇచ్చిన మాట ప్రకారం పింఛను మొత్తాన్ని పెంచడమే కాకుండా, ఈ పెంపును 2024 ఏప్రిల్ నుంచి వర్తింపజేస్తూ ఆదేశాలను జారీ చేశారు. ఈనేపథ్యంలో జిల్లాలోని వృద్ధులు, వితంతువులు, కళాకారులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, విభిన్న ప్రతిభావంతులు, దీర్ఘరోగుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. ఎన్‌టిఆర్ భరోసాగా పేరు మారిన ఈ పింఛను పథకం ద్వారా, జులైలో సాధారణ పింఛను దారులు ఒక్కొక్కరూ రూ.7వేలు అందుకోనున్నారు. ఎన్‌టిఆర్ భరోసా పథకం ద్వారా జిల్లాలో 2,82,194 మందికి లబ్ధి చేకూరుతోంది. ప్రస్తుతం పింఛన్ల కోసం నెలకు రూ.82.45 కోట్లు చెల్లిస్తుండగా, ఇకనుంచీ అదనంగా రూ.35.17కోట్లు చెల్లించాల్సి ఉంటుంది.

సామాజిక పింఛన్లను రూ.3వేలు నుంచి రూ.4వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. వికలాంగులకు ఇచ్చే పింఛను రూ.3వేలు నుంచి రూ.6వేలకు పెంచారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు, రంగస్థల కళాకారులు, హిజ్రాలకు ఈ పెంపు వర్తిస్తుంది. వీరికి మూడు నెలల బకాయిలతో కలిపి జులైలో పింఛను అందనుంది. పూర్తిగా అంగవైకల్యం (మంచం, కుర్చీకి పరిమితమైనవారు) ఉన్నవారికి, బోదకాలు వ్యాధిగ్రస్తులు, కిడ్నీ, కాలేయ మార్పిడి జరిగిన వారికి ఇస్తున్న నెలవారీ పింఛను రూ.5వేలు నుంచి రూ.15వేలకు పెంచారు.

జిల్లాలోని మొత్తం 15 కేటగిరీలకు చెందిన 2,82,194 మంది పింఛను దారులకు జూన్ నెలలో సుమారు రూ.82.45 కోట్లు చెల్లించగా, జులైలో గత మూడు నెలల బకాయిలతో కలిపి సుమారు రూ.187.36 కోట్లు పంపిణీ చేయనున్నారు. ఆగస్టు నుంచి మాత్రం నెలకు సుమారుగా రూ.117.62 కోట్లు అవసరం ఉంటుంది.

ఎమ్మెల్యేకు డిఎస్‌సి అభ్యర్థుల అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సిఎం చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన వెంటనే మెగా డిఎస్‌సికి సంతకం చేయడం పట్ల డిఎస్‌సి అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజును కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొంతమంది అభ్యర్థులకు తెలుగునాడు విద్యార్థి సంఘం తరపున మెటీరియల్‌ను ఎమ్మెల్యే అందజేశారు.

అభ్యర్థులకు మెటీరియల్ అందిస్తున్న ఎమ్మెల్యే అదితి

నేడు డయల్ యువర్ ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక ఆర్‌టిసి డిపో పరిధిలోని ప్రయాణికుల కోసం శనివారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విజయనగరం ఆర్‌టిసి డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4గంటల నుంచి ఐదు గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రయాణికులంతా 9959225620 నెంబరుకు ఫోన్‌చేసి సమస్యలు తెలిపి నివృత్తి చేసుకోవాలని కోరారు.

బకాయిలు చెల్లించకుంటే అరుణా జ్యూట్ మిల్లు స్వాధీనం

ఎఐఎఫ్‌టియు నాయకులు శంకరరావు

ప్రజాశక్తి-జయనగరం టౌన్

కార్మికుల బకాయిలు చెల్లించకపోతే విజయనగరం విటి అగ్రహారంలో గల అరుణా జూటిమిల్లు (శ్రీలక్ష్మీ శ్రీనివాసా జూటిమిల్స్) స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని అరుణా జ్యూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ (ఎఐఎఫ్‌టియు) అధ్యక్షుడు బెహరా శంకరరావు తెలిపారు. జ్యూట్‌మిల్లు స్థలాన్ని రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మార్చేడం అత్యంతర విషాదకరమని, పాలకుల విధానాలకు ఇది నిదర్శనమని అన్నారు. ప్రెస్ క్లబ్ లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజాంకు చెందిన ఈ జ్యూట్‌మిల్లు యాజమాన్యం మిల్లు ను మూసివేసి వేలాది కార్మిక కుటుంబాలను రోడ్డుపైకి నెట్టివేసిందని అన్నారు. ఇదే యాజమాన్యం పరిధిలోని ఈస్టుకోస్టు, బొబ్బిలి మిల్లులను కూడా ఈ విధంగానే మూసివేయడంతో మూడు మిల్లుల్లోని సుమారు 10 వేల కార్మిక కుటుంబాలు ఉపాధి లేక దయనీయ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పి.ఎఫ్. సొమ్ము సుమారు 5 కోట్ల రూపాయలు స్వాహా చేయడంపై యూనియన్ ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా పి.ఎఫ్ అధికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

యాజమాన్యం మిల్లును శాశ్వతంగా మూసివేయడంతో అప్పటి ఎమ్మెల్యే చొరవతో ఉభయ పక్షాలతో చర్చలు జరిపి జెసిఎల్ వద్ద 2020 నవంబర్‌లో కుదిరిన అగ్రిమెంటు ప్రకారం కార్మికుల గ్రాట్యుటీలు, పిఎఫ్‌లు, బోనస్ బకాయిలను 4 నెలల్లో చెల్లించి యంత్రాలను యాజమాన్యం తరలించుకునేందుకు అంగీకారం కుదిరిందని అన్నారు. అనంతరం కొద్దిపాటి బకాయిలు చెల్లించిన యాజమాన్యం కరోనా పేరుతో 2 సంవత్సరాల పాటు కనిపించకుండా పోయిందన్నారు. కరోనా అనంతరం దశలవారీగా బకాయిలు చెల్లిస్తామని ఒప్పుకున్న యాజమాన్యం ఇప్పటికీ సుమారు మూడు కోట్ల రూపాయల పి.ఎఫ్., ఐదుగురు కార్మికుల గ్రాట్యుటీని, సీనియర్ కార్మికుల సిక్ లీవును, 70 మందికి గ్రాట్యుటీ చెల్లించలేదన్నారు. వెంటనే సంబంధిత అధికారులు, జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకుంటే మిల్లు స్థలాలను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి పొంతపల్లి శ్రీను, బోడసింగి అప్పారావు, రెడ్డి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ఆర్అండ్‌బి స్థలం ఆక్రమణ

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని కొండతామరాపల్లి కూడలిలోని ఆర్అండ్‌బి స్థలం ఆక్రమణకు గురవుతోంది. మూడు రోడ్ల కూడలిలో అధికారుల విశ్రాంతి కోసం భవనాన్ని నిర్మించారు. 2000-02 కాలంలో జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసిన మంగపతిరావు తాటిపూడి రిజర్వాయరును సందర్శించిన సమయంలో ఆ భవనంలో ఆయన విశ్రాంతి తీసుకున్నారు. క్రమంగా నిర్వహణ సరిగా లేక భవనం శిథిలావస్థకు చేరింది. తరువాత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం మానేశారు. దీంతో ఆక్రమణల బారిన పడుతోంది. రోడ్డుకు ఆనుకుని ఉన్న ఆర్అండ్‌బి స్థలంలో వ్యాపారులు కలప నిల్వ చేస్తున్నారు. కొంతమంది అక్కడే పశువులను కడుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఈ విషయం ఆర్అండ్‌బి అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్అండ్‌బి స్థలంలో పెట్టిన కలప

డిజిపి ఆదేశాల అమలుకు ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బక్రీద్ సందర్భంగా రాష్ట్ర డిజిపి ఇచ్చిన ఆదేశాలును అమలు చేయాలని కోరుతూ కలెక్టరెట్ గాంధీ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ జంతువులు అక్రమ రవాణా, పశువధ నిర్మూలించేందుకు రాష్ట్ర స్థాయిలో ఎస్‌పి స్థాయి అధికారి, జిల్లాస్థాయిలో ఎఎస్‌పి లేదా డిఎస్‌పి స్థాయి అధికారులను ప్రత్యేక నోడల్ అధికారులుగా నియమిస్తూ డిజిపి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. జిల్లాలో పలు సంతలు నుండి ఎటువంటి లైసెన్స్‌లూ, అనుమతులు లేకుండా జంతువులను అక్రమ రవాణా చేస్తున్నా కేసులు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెవిఆర్ సత్యనారాయణ, చొళ్ళ రాజకుమారి, పట్టణ అధ్యక్షులు మద్దిల సోంబాబు, కార్యదర్శి రెడ్డిపల్లి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జంతు సంక్షేమ చట్టాలు ఉల్లంఘిస్తే చర్యలు

ఈనెల 17న బక్రీద్ పండగ సందర్భంగా జంతు సంక్షేమ చట్టాలను ఉల్లంఘించరాదని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎ.ఈశ్వరరావు తెలిపారు. అక్రమ పశు వధ, అక్రమ జంతు రవాణా చేయకూడదన్నారు. జంతు సంక్షేమ చట్టాలు ఉల్లంగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై జిల్లాలో పశు సంవర్ధక శాఖ అధికారులు, వెటర్నరీ అస్సిస్టెంట్ సర్జన్లు దృష్టి సారించాలని ఆదేశించారు.

గర్భాంలో రైతు విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు

విత్తనాల కోసం ఆర్‌బికెలకు రైతులు

ప్రజాశక్తి-మెరకముడిదాం

విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాలకు రైతులు క్యూ కడుతున్నారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా ఉండటంతో రైతులు వరి విత్తనాల కోసం బారులు తీరుతున్నారు. విత్తనాల కోసం ఆర్‌బికెల వద్ద రైతులు ఆధార్ నంబర్లు ఇచ్చి పేర్లు నమోదు చేసుకుని, డబ్బులు చెల్లిస్తున్నారు. సమయానికి విత్తనాలు దొరుకుతాయో లేదోనని రైతులు ఆర్‌బికెలకు పరుగులు తీస్తున్నారు.

గుర్రపు కోనేరు ఆక్రమణపై దర్యాప్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

గుర్రపు కోనేరు ఆక్రమణపై రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేశారు. పట్టణంలోని ఉన్న గుర్రపు కోనేరు గట్టు తవ్వి ఆ మట్టిని కోనేరులో వేసి గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమణకు పాల్పడ్డారు. గుర్రపు కోనేరు ఆక్రమణకు గురికావడంతో మీడియాలో వచ్చిన కథనాలకు స్పందించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి కోనేరు వద్దకు వెళ్లి డిప్యూటీ సర్వేయర్‌తో సర్వే చేశారు. సర్వే నెంబర్ 189-2లో ఉన్న గుర్రపు కోనేరు ఆక్రమణపై దర్యాప్తు నివేదికను రెవెన్యూ ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆర్ఐ చెప్పారు.

29న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-రాజాం

రాజాం కోర్టు ఆవరణలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.రామినాయుడు, మాజీ అధ్యక్షులు కె.రమణమూర్తి, ఉపాధ్యక్షులు జయదేవ్, ఎజిపి ఎస్.పోలారావు, కార్యదర్శి వై.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పార్కింగ్ చేసిన స్కూల్ బస్

రోడ్డుపైనే స్కూల్ బస్సు పార్కింగ్

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో బలిజిపేట రోడ్డులో సురేష్ స్కూల్ ముందు రోడ్డుపైనే స్కూల్ బస్సును పార్కింగ్ చేస్తున్నారు. రోడ్డుపై బస్సు పార్కింగ్ చేయడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై బస్సు పార్కింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డుపై బస్సు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-తెర్లాం

స్థానిక ఎంఆర్‌సి నుంచి మండలంలోని పాఠశాలలకు స్టూడెంట్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని 67 పాఠశాలల్లోని విద్యార్థులకు వీటిని పంపిణీ చేయనున్నట్లు ఎంఇఒలు త్రినాథరావు, పాపారావు తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల్లో పూడికలు తొలగించండి

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని మురుగునీటి కాలువల్లో పూడికలు ఎప్పటికప్పుడు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పట్టణంలో వర్షం కురవడంతో పూల్‌బాగ్, మేదరబంద, బ్యాంకుకాలనీలోని కాలువలో పూడికలు పేరుకుపోయి వరదనీరు రోడ్డుపైకి చేరింది. ఈ విషయం తెలుసుకున్న కమిషనర్ రామలక్ష్మి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య కార్మికులతో పూడికలు తొలగించారు. పారిశుధ్య పనులపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పిల్లల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలకు ఐసిడిఎస్ పిఒ ఆధ్వర్యాన పిల్లల పెంపకంపై శిక్షణ ఏర్పాటుచేశారు. పిహెచ్‌సి వైద్యాధికారి ధరణి మాట్లాడుతూ కుటుంబంలో పిల్లలను పెంచే విధానంపై సూచనలిచ్చారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-రేగిడి

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రేగిడి పిహెచ్‌సి వైద్యాధికారి అసిరినాయుడు అన్నారు.. శుక్రవారం సంకిలి గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి మలేరియా, టైఫాయిడ్, సీజనల్ వ్యాధుల పట్ల సర్వే నిర్వహించారు. వర్షాకాలంలో వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సర్వేలో హెల్త్ సూపర్వైజర్ కుప్పిలి అప్పారావు, ఎఎన్ఎం జ్యోతి, జనార్ధన, ఆశా కార్యకర్తలు ఉన్నారు

జ్యూట్ కార్మికులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ కార్మికులకు న్యాయం చేయాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జ్యూట్ మిల్లు స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేసిన యాజమాన్యం కార్మికులకు పిఎఫ్ బకాయిలు చెల్లించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. పిఎఫ్ చెల్లించకపోవడంతో చాలామంది కార్మికులకు పింఛన్లు రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

కళాశాల చదువుకు ఆదిలోనే అడ్డం

- విద్యార్థులను రప్పించడంలో నిర్లక్ష్యం
- ప్రయివేటు యాజమాన్యాల ఒత్తిళ్లతో వెనుకడుగు
- ప్రహసనంగా సాగుతున్న అడ్మిషన్లు

ప్రజాశక్తి - జామి

ఆదిలోనే హంసపాదు అన్న చందంగా ఉంది.. జామి హైస్కూల్ ప్లస్-2లో ఇంటర్ అడ్మిషన్ల తీరు. నిన్నటి వరకూ ఇంటర్ చదువులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండాలని ఈ ప్రాంత వాసులు ఎన్నో కలలు కన్నారు. ఒక దశలో కాలేజీ సాధన కోసం ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు ఉద్యమానికి నడిపారు. జూనియర్ కళాశాల సాధ్యం కాకున్నా, ఉన్నత పాఠశాలలోనే ఇంటర్ చదువులకు అవకాశం లభించింది. కానీ అధికారులు నిర్లక్ష్యం, కొంత మంది స్వార్థం కోసం ఈ ఏడాది విద్యార్థుల చేరిక ప్రహసనంగా సాగుతోంది. ప్రయివేటు బదులు మాదిరిగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి, విద్యార్థులను సన్నద్ధం చేయడం చూస్తున్నాం. కానీ జామి హైస్కూల్లో ఇంటర్ అడ్మిషన్లపై పట్టించుకున్న నాథుడే కరువయ్యారు.

జామి హైస్కూల్ ప్లస్-2లో 15 రోజుల క్రితం 40 మందికి పైగా విద్యార్థులు ఇంటర్ చదువులకు దరఖాస్తులు చేసుకున్నారు. కానీ, అందులో సగానికి పైగా పిల్లలు ఇక్కడ చేరేందుకు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీనికి కారణం విద్యార్థులతో మాట్లాడి, వారిని ప్రోత్సహించిన వారు లేరని తెలుస్తోంది. జామిలో చేరేందుకు వచ్చిన విద్యార్థులకు సరైన అధ్యాపకులు లేరని కొంత మంది ఉపాధ్యాయులే తప్పుదోవ పట్టించి, ప్రయివేటు కళాశాలలకు సహకరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటర్ చదువులకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని ఇంటర్‌లో చేరికల కోసం ఉద్యమంలా కష్టపడాలని ప్రజలు కోరుతున్నారు.

ఫ్యాకల్టీ బాధ్యత ప్రభుత్వానిదే

జామి మండలంలో 25 పంచాయతీలు ఉన్నాయి. అందులో మెజారిటీ ప్రజానీకం వ్యవసాయ ఆధారిత కుటుంబాలే. మండలంతోపాటు ఎస్.కోట, ఎల్.కోట, వేపాడ, గంట్యాడ మండలంలో అనేక గ్రామాలు మండలానికి అతి చేరువలో ఉంటాయి. విశాఖ జిల్లా పద్మనాభం మండలంలోని కొన్ని గ్రామాలు కూడా జామి మండల కేంద్రానికి సమీపాన ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే పదో తరగతి తర్వాత ఇంటర్ చదువులకు విజయనగరం, ఎస్.కోట, కొత్తవలస, విశాఖ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడుతోంది. జామిలో జూనియర్ కాలేజి వస్తే, వందలాది మంది పేద విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ అందుబాటులోకి వచ్చి ఉన్నత చదువులు వీలు కలుగుతుందని అంతా భావించారు. అనుకున్నట్లే ఇంటర్ చదువులకు అవకాశం లభించింది. పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు బాధ్యత తీసుకుని సరైన అధ్యాపకుల బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారులు ఫ్యాకల్టీ మంజూరు చేస్తామని, అందుకు తగ్గ విద్యార్థులు హాజరు కోసం కృషి చేయాలని ఆదేశించినట్లు సమాచారం. కానీ ఇక్కడి ఉపాధ్యాయులు అటువంటి ప్రయత్నం చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

జామిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (హైస్కూల్ ప్లస్)

రాజకీయాలకు అతీతంగా..

జూనియర్ కాలేజీ సాధనకు జామిలో ఉద్యమించిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వ విధానాల్లో భాగంగా ఇంటర్ చదువును జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోనే అందించేందుకు రంగం సిద్ధం చేసింది. కావున ఇంటర్ విద్యార్థుల హాజరు కోసం రాజకీయాలకు అతీతంగా ముందుకు రావాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే పలువురు గ్రామ నాయకులు అధ్యాపకుల కోసం తమ సొంత నిధులు విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో తూతూ మంత్రంగా సమావేశాలు కాకుండా గ్రామంలోని ప్రజాప్రతినిధులు, యువత, మేధావులు, విశ్రాంత ఉద్యోగులను సమన్వయ పరిచి, విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు కృషి చేయాలని, అప్పుడే కాలేజీ చదువులు పేదలకు అందుతాయని ప్రజలు అంటున్నారు.

గజపతినగరంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

భోగాపురం.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

ప్రజలకు నచ్చేలా పాలన

నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి

ప్రజాశక్తి-భోగాపురం

వచ్చే ఐదేళ్లలో ప్రజలకు నచ్చేలా పాలన అందిస్తామని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు ఐదు ఫైళ్లపై సంతకాలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై లబ్ధిదారులతో మాట్లాడేందుకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. అలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు మెచ్చే పాలనను అందిస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని అధికారులు ప్రజల అభివృద్ధి చెందే విధంగా పనిచేయాలని సూచించారు. ప్రతి సచివాలయంలో రిజిస్టర్‌ను ఏర్పాటుచేసి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు నమోదు చేయాలని సూచించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ అన్న క్యాంటీన్లను మళ్లీ ఏర్పాటు చేయడం పేదలకు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు, కడగల ఆనంద్ కుమార్, సువ్వాడ రవిశేఖర్, బి.శ్రీధర్, మహంతి చిన్నం నాయుడు, కర్రోతు సత్యనారాయణ, పతివాడ తమ్మునాయుడు, గేదెల రాజారావు, మట్ట అయ్యప్పరెడ్డి, చెల్లుబోయిన నర్సింగరావు, తుమ్మి లక్ష్మీ రాజ్, ఎంపిడిఒ చంద్రకళ, తహశీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఇఒపిఆర్‌డి సురేష్, పల్లంట్ల జగదీష్, పళ్ళ రాంబాబు పాల్గొన్నారు.

ప్రజా పాలనకు శ్రీకారం

గజపతినగరం : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తమ కూటమి ప్రభుత్వం ప్రజా పాలనకు శ్రీకారం చుట్టిందని టిడిపి నాయకులు, మాజీ ఎంపిపిలు మక్కువ శ్రీధర్, గంట్యాడ శ్రీదేవి, మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, కొండపల్లి భాస్కర్ నాయుడు, అట్టాడ లక్ష్మునాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, బాధ్యతలు స్వీకరించిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. ఇందులో భాగంగానే ఐదు దస్త్రాలపై సంతకాలు పెట్టి ప్రజా పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. మెగా డీఎస్సీ ,ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, పింఛను నాలుగు వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సెస్ వెంటనే అమల్లోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షించ దగ్గ విషయం అన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో తమ ప్రభుత్వం మరిన్ని ప్రజా రంజకమైన పథకాలను అమలు చేయనున్నదన్నారు. ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్ కు మంత్రివర్గంలో చోటు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ సర్వతోముఖాభివద్ధికి సమిష్టిగా కృషి చేస్తామన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు రంది రామనాయుడు, జి. గోవింద, రుంకాన అరుణ, బెజవాడ బంగారు నాయుడు, మిత్తిరెడ్డి వెంకటరమణ, లంక సత్యనారాయణ, లంక చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

బాడంగి : ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో సిఎం చంద్రబాబునాయుడు ఐదింటిని నెరవేర్చి, మాట నిలబెట్టుకున్నారని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంపిటిసి పాలవలస గౌరు ఒక ప్రకటనలో తెలిపారు. సిఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మొదటి సంతకం మెగా డిఎస్‌సిపై చేసి నిరుద్యోగ యువత హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం చేసి రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని చెప్పారు. మూడో సంతకంతో పింఛన్లను రూ.4 వేలకు పెంచడం ద్వారా పింఛనుదారుల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు.

సెంచూరియన్‌లో మెడికల్ కోడింగ్‌పై సదస్సు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో పారా మెడికల్ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌పై శుక్రవారం సదస్సు జరిగింది. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ఆన్ లైన్‌లో ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా ఇండస్ట్రీలో మెడికల్ కోడింగ్ నేర్చుకునే వారికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి. పల్లవి మాట్లాడుతూ వ్యాధులను నిర్ణయించేటపుడు దానికి కోడింగ్ ఇస్తారని , ఆ కోడింగ్ ఎలా ఇస్తారోనన్నది మెడికల్ కోడింగ్‌లో నేర్పిస్తారని తెలిపారు. విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేశామన్నారు. కోడింగ్ నేర్చుకుంటే సాఫ్ట్ వేర్ మాదిరిగా అత్యధిక వేతనాలు పొందే అవకాశం ఉందన్నారు. ఒమేగా ఆసుపత్రి నుంచి విచ్చేసిన డాక్టర్ కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఇటువంటి మెడికల్ కోడింగ్ అనేది అందించడం వల్ల వారికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. థాట్ ఫ్లోస్ అకాడమి రీజనల్ మేనేజర్ లోకేష్ మాట్లాడుతూ కోడింగ్ నేర్చుకుంటే బహుళ జాతీయ కంపెనీలో పనిచేసే అవకాశం దక్కుతుందన్నారు. కార్యక్రమానికి డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు కన్వీనర్ గా వ్యవహరించారు. పలువురు పారామెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

గ్రంథాలయ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మికి ఎమ్మెల్యే బేబినాయన సూచించారు. శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం భవనం బాగు చేసి అప్పగించాలని ఆదేశించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ గ్రంథాలయాన్ని బాగు చేసేందుకు మున్సిపల్ నిధులు రూ.6 లక్షలు కేటాయించామని వివరించారు. నెల రోజుల్లో భవనాన్ని బాగు చేసి అప్పగిస్తామన్నారు. ఆయనతో గ్రంథాలయ అధికారి స్వర్ణకుమారి, కౌన్సిలర్లు రాంబార్కి శరత్, వి.హైమావతి, స్వప్న, మున్సిపల్ ఎఇ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో పాలన అందించాలి

రాజ్యాంగ స్ఫూర్తితో సుపరిపాలన అందించాలని ఎమ్మెల్యే బేబినాయనను కారుణ్య ఫౌండేషన్ ఛైర్మన్ జెసి రాజు కోరారు. జెసి రాజు తన కుమారుడు డేవిడ్ జె విక్టర్‌తో కలిసి ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యాంగ ప్రతిని ఆయనకు అందించారు. ఆయనతోపాటు మెట్టవలస సర్పంచ్ మాధవ, మాజీ సర్పంచ్ కెల్లా తవుడు ఉన్నారు.

గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

క్యాంపు కార్యాలయంలో సంబరాలు

ఎన్నికల హామీల్లో భాగంగా సిఎం చంద్రబాబు ఐదు సంతకాలు చేయడంతో ఎమ్మెల్యే బేబినాయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. కేకు కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు.

రక్తదానం.. ప్రాణదానం

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి ఇఐడి ప్యారీ చక్కెర పరిశ్రమలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సంస్థ ఉపాధ్యక్షులు వి.పట్టాభి రామిరెడ్డి ప్రారంభించారు. 70 మంది కార్మికులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పట్టాభి రామిరెడ్డి మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానం అన్నారు. రక్తం నిల్వలు లేక ఎంతోమంది అభాగ్యులు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. జిల్లాలో రక్త నిల్వలు తక్కువగా ఉన్న సందర్భంలో 70 మంది ఉద్యోగులు రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ రాజాం ఛైర్మన్ కొత్త సాయి ప్రశాంత కుమార్, జాతీయ యవజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య కుమార్, హెచ్‌ఆర్ హెడ్ మేనేజర్ వి.మురళీకృష్ణ, షుగర్ ఫ్యాక్టరీ అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది ఈశ్వరరావు, కెప్టెన్ పిసి నాయుడు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, నారాయణ, సుజాత, పవన్, జగదీశ్ పాల్గొన్నారు.

రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న హెచ్‌ఆర్ హెడ్ మేనేజర్ మురళీకృష్ణ

విజయనగరం : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా విజయదుర్గ యూత్ సొసైటీ, విజయనగరం యూత్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదిత్య డిగ్రీ కళాశాల సహకారంతో స్థానిక విజయబ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వచ్ఛందంగా 32 మంది యువతి యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో విజయ్ దుర్గా యూత్ సొసైటీ ఛైర్మన్ కేశవపట్నం చంద్రిక, విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్. ఇల్తమాష్, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ దామోదర్ రావు విజయ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ పుణ్యమంతుల శివ ఆదిత్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారిని సన్మానించారు.

రక్తదాతలకు సత్కారం

విజయనగరం టౌన్ : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీ సాయి కష్టా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అయ్యన్నపేట జంక్షన్ కూడలిలో ఉన్న నడకమైదానంలో 59 సార్లు రక్తదానం చేసిన ప్రముఖ సంఘసేవకులు త్యాడ ప్రసాద్ పట్నాయక్ కు, 69 సార్లు రక్తదానం చేసిన వాకర్స్ క్లబ్ సభ్యుడు, రైల్వే ఉద్యోగి కె.రామకృష్ణ, 52 సార్లు రక్తదానం చేసిన పతివాడ కుమార్‌కు క్లబ్ సభ్యులంతా ఘనంగా సత్కరించారు.వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు, క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ, క్లబ్ గౌరవ సలహాదారులు ఆరికతోట తిరుపతిరావు, క్లబ్ కార్యదర్శి ఐ.వి.ప్రసాదరావు, కోశాధికారి ఆర్‌సిహెచ్ అప్పలనాయుడు, జాలీ వాకర్ కిలారి గోవింద్, ఉపాధ్యక్షుడు వల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకుడిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గుర్ల

మండలంలో పాలవలస క్షేత్ర సహాయకులు గేదెల సత్యనారాయణను తొలగించాలని కూలీలు శుక్రవారం ఎంపిడిఒ వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. రెండేళ్ల క్రితం క్షేత్ర సహాయకుడిని విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. 15వ సామాజిక తనిఖీలో లోపాలు ఉన్నట్లు తేలడంతో తాత్కాలికంగా నిలుపుదల చేశారు. క్షేత్ర సహాయకుడు కోర్టును ఆశ్రయించడంతో విధుల్లోకి తీసుకోవాలని కోర్టు తీర్పునిచ్చింది. అధికారులు తిరిగి క్షేత్ర సహాయకుడిని విధుల్లోకి తీసుకున్నారు. ఈ నెల ఏడో తేదీ నుంచి విధులకు హాజరై చెరువు పనులు మొదలు పెట్టారు. గ్రామంలో కొంతమంది ఉపాధి వేతనదారులు.. క్షేత్ర సహాయకుడి పనితీరు బాగాలేదని ఎంపిడిఒకి శుక్రవారం ఫిర్యాదు చేశారు. కూలీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయమై ఎంపిడిఒ వెంకటరమణ స్పందిస్తూ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి, ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని చెప్పారు.

నవధాన్యాలతో నేలకు మేలు

ప్రజాశక్తి-బాడంగి

నవధాన్యాల సాగు వల్ల భూసారం పెరుగుతుందని రేజేరు విఎఎ సాయికుమార్ తెలిపారు. శుక్రవారం రేజేరు రైతు భరోసా కేంద్రంలో నేల సారం పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. నవధాన్యాలు సాగుచేసి 45-50 రోజుల సమయంలో నేలలో కలియ దున్నడం వల్ల నేలకు తగిన పోషకాలు సమృద్ధిగా అంది పంట దిగుబడులు బాగుంటాయని చెప్పారు. ఈ సందర్భంగా రైతులకు నవధాన్యాల కిట్లను అందజేశారు.

కూలీల ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వీలుపర్తి క్షేత్ర సహాయకుడు రమణపై కూలీలు చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఎపిఒ ఆదిలక్ష్మి విచారణ చేపట్టారు. కూలీలను దుర్భాష లాడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎపిఒ విచారణలో ఎక్కువమంది కూలీలు అందుకు విరుద్ధంగా చెప్పారు. పనికి ఆలస్యంగా వస్తే ఒప్పుకునేది లేదని చెబుతున్నారని వివరించారు. ఎపిఒ మాట్లాడుతూ క్షేత్ర సహాయకుడు పనిలోకి రాకుండా ఆటంకం కల్పిస్తే వెంటనే తనకు ఫోన్ చేయాలని సూచించారు. అంతే తప్ప ఫిర్యాదులు చేసుకోవడం వల్ల కూలీలకే నష్టం కలుగుతుందని చెప్పారు.

విచారణ చేపడుతున్న ఎపిఒ ఆదిలక్ష్మి

ముసుగు తొలగించండి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికల కోడ్ ముగిసిందని, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వేసిన ముసుగును తొలగించాలని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్, మండల పరిషత్తు కో అప్షన్ సభ్యులు షేక్ సర్దార్ భాయ్ కోరారు. అమ్మిగారి కోనేరుగట్టుపై ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎన్నికల ముందు ముసుగు వేసిన అధికారులు.. ఎన్నికల కోడ్ ముగిసినా ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-గజపతినగరం

పురిటిపెంట న్యూకాలనీలో ఆరు రోజుల క్రితం జరిగిన ఓ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన మూడు లక్షల 70 వేల రూపాయల విలువగల బంగారం నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాస్ స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈనెల 8న పురిటి పెంట న్యూ కాలనీలోని బుడ్డెపు తిరుపతి తన ఇంట్లో దొంగతనం జరిగినట్లు 9వ తేదీ ఉదయాన్నే పోలీసులు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మండలంలోని మధుపాడ జంక్షన్ వద్ద నిందితుడు పిల్ల సత్తిబాబును పట్టుకున్నారు. అతని నుంచి 11.5 తులాల బంగారం, రూ.80వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బంగారంలో 12 గాజులు, నెక్లెస్, ఇతర బంగారు ఆభరణాలు ఉన్నాయి. సమావేశంలో సిఐ ప్రభాకర్ రావు, ఎస్ఐ మహేష్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని నరవ ఎఎంజి కాలనీ సమీపంలో శుక్రవారం ఆటో, మోటార్ సైకిల్ ఢీకొని యువకుడు కొంచాడ రామారావు (27) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పెదమజ్జిపాలెం గ్రామానికి చెందిన కొంచాడ రామారావు విజయనగరం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ఆటో ఆయన్ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని విజయనగరం రూరల్ సిఐ శ్రీనివాసరావు, గంట్యాడ ఎస్ఐ సురేంద్రనాయుడు పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

ఘటనా స్థలంలో యువకుడి మృతదేహం

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE COURT CHEEPURUPALLI
OS 70/2023 IA 411/2023

Between:
Meesala Appala Naidu S/o Suryanarayana, Ag 35, R/o Konuru (Vill), Garividi (MD), Vizianagaram Dist. .....Plaintiff
And:
Damarasingi Appaji, Ag 40 years, S/o late Thavudu, R/o Konuru (Village), Garividi (MD), Vizianagaram Dist. ......Defendant

GENERAL NOTICE

Please take notice, that the above named Plaintiff filed suit against for Recovery of Promessory note Amount and also an application under ord XXXIX (39) Rule V (3) Vide IA 411/2023 in OS 70/2023, attach the schedule Mention property that the Honourable Court Several times Issue Summons to you. But you want only Escaped the Service of the same.

That the above suit and IA Posted for Hearing at **10-30 AM or 20-06-2024** Before the above suit said court If you want to contest the matter you may do so either In person or by duly Instrueted Pleadar and If you fails to so cause matter will be decided in options and exparty.

(By order of the Honourable court)

M.Lakshmana Rao
Advocate, Cheepurupalli
Cell: 9490678935

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE COURT CHEEPURUPALLI
OS 69/2023 IA 409/2023

Between:
Korada Seethamma W/o Suryanarayana, Ag 40, R/o Konuru (Vill), Garividi (MD), Vizianagaram Dist. .....Plaintiff
And:
Damarasingi Appaji, Ag 40 years, S/o late Thavudu, R/o Konuru (Village), Garividi (MD), Vizianagaram Dist. ......Defendant

GENERAL NOTICE

Please take notice, that the above named Plaintiff filed suit against for Recovery of Promessory note Amount and also an application under ord XXXIX (39) Rule V (3) Vide IA No 409/2023 in OS 69/2023 to attach the schedule Mention property that the Honourable Court Several times Issue Summons to you. But you want only Escaped the Service of the same.

That the above suit and IA Posted for Hearing at **10-30 AM or 19-06-2024** Before the above suit said court If you want to contest the matter you may do so either In person or by duly Instrueted Pleadar and If you fails to so cause matter will be decided in options and exparty.

(By order of the Honourable court)

M.Lakshmana Rao
Advocate, Cheepurupalli
Cell: 9490678935